సాక్షి నారాయణపేట

మంగళవారం, 23, మే, 2023



రేపు పాలెంలో విత్తనమేళా

పాలెం వ్యవసాయ పరిశోధన స్థానంలో విత్తన మేళా నిర్వహించనున్నారు.

వివరాలు 8లో ▸



ఇష్టారాజ్యం!

అక్రమార్కుల ధనదాహంతో ప్రభుత్వ పథకాలు, ఆశయాలు నీరుగారుతున్నాయి.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 39.3 /27.2

ఉదయం ఎండగా ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోత తప్పదు. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమవుతుంది.

న్యూస్‌రీల్

సీఐ కార్యాలయం తనిఖీ



మక్తల్: మక్తల్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం నారాయణపేట డీఎస్పీ సత్యనారాయణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలురికార్డులు పరిశీలించారు. పెండింగ్ కేసులపై ఆరా తీశారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మక్తల్ ఎస్ఐ పర్వతాలు సిబ్బంది ఉన్నారు.

సివిల్ కేసులు కోర్టులో పరిష్కరించుకోవాలి



నారాయణపేట రూరల్: సివిల్ కేసులను ఫిర్యాదుదారులు కోర్టు ద్వారానే పరిష్కరించుకోవాలని ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఎనిమిది ఫిర్యాదులు వచ్చాయి. ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు నేరుగా ఫిర్యాదుదారులతో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్జీలను స్వీకరించారు. సంబంధిత ఎస్ఐలకు బదిలీ చేసి, వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

ఫిర్యాదులు స్వీకరించిన కలెక్టర్



నారాయణపేట: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ శ్రీహర్ష ఫిర్యాదులు స్వీకరించారు. వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎక్కువగా భూ సమస్యలు, పింఛన్ అందకపోవడంపై అర్జీలు అందాయని అధికారులు తెలిపారు.

సుప్రీం తీర్పు అమలుచేయాలి



నారాయణపేట రూరల్: కేజీబీవీ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ టీచర్స్ యూనియన్ నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు వేణుగోపాల్ మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమానపనికి సమాన వేతనం చట్టం అమలు చేయాలని, ఎస్ఓలను ప్రిన్సిపాల్స్‌గా, పీజీ సీఆర్‌టీలను స్కూల్ అసిస్టెంట్లుగా గుర్తించి క్వార్టర్స్ కేటాయించాలన్నారు. హాస్టల్ నిర్వహణకు కేర్ టేకర్స్‌ను నియమించాలని, నైట్ డ్యూటీల నుంచి సీఆర్‌టీలకు మినహాయింపు ఇవ్వాలన్నారు. పీఆర్‌సీ సిఫారస్ ప్రకారం కాంట్రాక్ట్ ఉద్యోగులకు రూ.వెయ్యి ఇంక్రిమెంట్ ఇవ్వాలన్నారు. హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని, విద్యార్థులకు కాస్మొటిక్ చార్జెస్, శానిటరీ కిట్స్ ఇవ్వాలని, అన్నిరకాల సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కె.బాలాజీ, శివరాములు, భీమయ్య, శైలజ, వీణ పాల్గొన్నారు.

వరి సోనామసూరి క్వింటా రూ.2,061

నారాయణపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం వడ్లు సోనామసూరి క్వింటా ధర గరిష్టంగా రూ.2,061, కనిష్టంగా రూ.1,425 పలికింది. హంస గరిష్టంగా రూ. 1,525, కనిష్టంగా రూ.1,506లు లభించింది.

‘నకిలీ’పై నజర్



నారాయణపేటలోని ఫర్టిలైజర్ దుకాణంలో తనిఖీలు చేపట్టిన పోలీసులు

జిల్లా సరిహద్దు చెక్‌పోస్టుల్లో తనిఖీలు

- ఫర్టిలైజర్, సీడ్స్ దుకాణాలపై ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌తో దాడులు
- నాసిరకం ఎరువులు, నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్టు కేసులు
- నాలుగేళ్లలో 33 కేసులు నమోదు



ఊట్కూర్ మండలంలోని తిప్రాస్‌పల్లిలో పట్టుబడిన నకిలీ పత్తి విత్తనాలు (ఫైల్)

నారాయణపేట: రైతుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని నకిలీ విత్తన వ్యాపారులు జిల్లాలో మోసాలకు పాల్పడుతున్నారు. తక్కువ ధరకే విత్తనాలు ఇస్తామంటూ ఆశ చూపి నకిలీ విత్తనాలు అంటగడుతున్నారు. భారీగా కమీషన్ ఇస్తామంటూ పలు కంపెనీలు స్థానికంగా పలువురిని ఏజెంట్లుగా నియమించుకుని ఈ దందాను కొనసాగిస్తున్నాయి. టాస్క్‌ఫోర్స్ అధికారుల దాడులతో ఈ సంఘటనలు బట్టబయలు అవుతున్నాయి.

33 కేసులు.. 2,905 క్వింటాళ్ల విత్తనాలు

జిల్లాలో 2019లో 6 కేసులు, 2020లో 9 కేసులు, 2021లో 12 కేసులు, 2022లో 5 కేసులు, 2023-01 కేసు నమోదైంది. మొత్తం 42 మంది పట్టుబడ్డారు. వారి నుంచి రూ.19,99,731 విలువ చేసే 2,905 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు.

ధర తక్కువ.. దిగుబడి ఎక్కువ

సాధారణంగా ఎకరా పత్తి సాగు చేయాలంటే బీపీటీ-2 రకానికి చెందిన రెండు పత్తి విత్తన ప్యాకెట్లు అవసరం. ఒక్కో ప్యాకెట్‌ను బ్రాండెడ్ కంపెనీల కంటే రూ.200 నుంచి రూ.300 తక్కువ ఇస్తామంటూ మోసం చేస్తున్నారు. ప్యాకెట్‌పై ధర తగ్గుతుండడంతో రైతులు కొనుగోలు చేస్తూ మోసపోతున్నారు. వాస్తవానికి ఒక ఎకరంలో పత్తి సాగు చేస్తే 8 నుంచి 12 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. నకిలీ విత్తనాల వల్ల 5క్వింటాళ్లు దిగుబడి రావడం లేదు.

జిల్లాలో పట్టుబడిన నకిలీ పత్తి విత్తనాలు, కేసుల వివరాలు

పోలీస్ స్టేషన్	కేసులు	ఎంత మంది	కేజీల్లో	విలువ (రూ.లలో)
దామరగిద్ద	6	6	186	1,59,666
ధన్వాడ	1	1	75	75,000
కోస్గి	3	6	385	6,36,580
కృష్ణా	1	1	63	1,07,750
మద్దూర్	2	2	58.5	1,20,876
మాగనూర్	1	1	2.5	4,000
మక్తల్	5	6	1,198	4,88,625
మరికల్	3	5	77.90	77,900
నారాయణపేట	5	5	611	2,54,084
ఊట్కూర్	5	7	236.1	63,250
నర్వ	1	2	12	12,000
మొత్తం	33	42	2,905	19,99,731

రశీదు పొందాలి..



వానాకాలం సీజన్ ప్రారంభమవుతుంది. విత్తనాల కొనుగోలులో రైతులు జాగ్రత్తగా వ్యవహరించాలి. లైసెన్స్ ఉన్న డీలర్ల తోనే విత్తనాలు కొనాలి. రశీదు తీసుకోవాలి. అపరిచిత వ్యక్తుల నుంచి విత్తనాలు కొనుగోలు చేస్తే నష్టపోతారు.

– జాన్ సుధాకర్, డీఏఓ, నారాయణపేట

పీడీ యాక్టు తప్పదు..



నకిలీ విత్తనాలు విక్రయిస్తే వారిపై పీడీ యాక్టు కేసు తప్పదు. అధిక ధరలకు, నాణ్యతలేని విత్తనాలు అమ్మినా, నాసిరకం ఎరువులు విక్రయించినా డీలర్ల లైసెన్స్‌లు రద్దు చేస్తున్నాం. జిల్లాలో టాస్క్‌ఫోర్స్ బృందాలతో దాడులు ముమ్మరం చేస్తున్నాం. ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మినట్లు తెలిస్తే ప్రజలు వెంటనే 100కు డయల్ చేయవచ్చు. – ఎస్.వెంకటేశ్వర్లు, ఎస్పీ

సరిహద్దుల్లో ‘చెక్’..

రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్‌అలీ, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, డీజీపీ అంజనీకుమార్ ఆదేశాలతో ఎస్పీ నేతృత్వంలో తెలంగాణ, కర్ణాటక సరిహద్దులో ప్రత్యేకంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. పక్క రాష్ట్రాల నుంచి నకిలీ పత్తి విత్తనాలు వచ్చే అవకాశం ఉండడంతో వాటికి చెక్ పెట్టేందుకు ప్రతీ వాహనాన్ని పోలీసులు తనిఖీ చేస్తున్నారు. జిల్లాలోని నారాయణపేట మండలం ఎక్లాస్‌పూర్, జలాల్‌పూర్, దామరగిద్ద మండలం కానుకుర్తి, కృష్ణా మండలం వాసవినగర్, చేగుంటలో చెక్‌పోస్టుల్లో ప్రత్యేక నిఘా ఉంచారు. నకిలీ విత్తనాలు సరిహద్దు దాటి రావద్దంటూ విధులు నిర్వహించే పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ ఎస్.వెంకటేశ్వర్లు సూచిస్తున్నారు.

రంగంలోకి టాస్క్‌ఫోర్స్..

నకిలీ విత్తనాలు, నాసిరకం ఎరువుల విక్రయాలను అరికట్టేందుకు కలెక్టర్ శ్రీహర్ష, ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు ఆదేశాలతో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్‌సుధాకర్ సూచనలతో వ్యవసాయ, పోలీస్‌శాఖ, ఇతర శాఖల అధికారులు టాస్క్‌ఫోర్స్ బృందాలుగా ఏర్పడ్డారు. జిల్లా వ్యాప్తంగా ఈ బృందాలు ఆకస్మిక దాడులు చేస్తున్నారు. మండల స్థాయిలో అగ్రికల్చర్ ఏఓ, ఎస్ఐతో పాటు పలువురు సిబ్బంది, జిల్లాస్థాయిలో టాస్క్‌ఫోర్స్‌లో సీఐలు, అగ్రికల్చర్ అధికారులతో టాస్క్‌ఫోర్స్ బృందాలు ఏర్పడ్డాయి. ఆ బృందాలు నకిలీలపై నిఘా పెట్టారు. ఫర్టిలైజర్ దుకాణాలల్లో జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా తనిఖీలు చేస్తూ, నకిలీ విత్తనాలు, నాసిరకం ఎరువులను విక్రయిస్తే క్రిమినల్ కేసుతో పాటు, పీడీ యాక్టు నమోదు చేస్తామని, గుర్తింపు రద్దు చేస్తామంటూ డీలర్లను హెచ్చరిస్తున్నారు. ఆకస్మికంగా తనిఖీలు, దాడులతో నకిలీ వ్యాపారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఇప్పటికే పత్తి విత్తనాలను విత్తేందుకు రైతులు సిద్ధమవుతున్నారు.

నెరవేరిన కల



హన్వాడలో ధర్నా చేస్తున్న వీఆర్‌ఏలు

ఎట్టకేలకు వీఆర్‌ఏల క్రమబద్ధీకరణకు మోక్షం

- వివరాల సేకరణకు సీసీఎల్‌ఏ చర్యలు
- మూడు రోజుల్లోగా నివేదించాలని కలెక్టర్లకు ఆదేశాలు
- 27 ఏళ్ల నిరీక్షణకు దక్కనున్న ఫలితం
- ఉమ్మడి జిల్లాలో 3,536 మందికి మేలు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ఎన్నో ఏళ్ల సుదీర్ఘ పోరాటం.. వ్యయ, ప్రయాసాలకోర్చి నిర్వహించిన విధులు.. కొందరికి పదోన్నతులు రాగా న్యాయస్థానానికి, సీసీఎల్‌ఏ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న వారు కొందరైతే.. బ్యాన్ పీరియడ్‌లో నియామకమై ఇబ్బందులతో సతమతమవుతున్న గ్రామ రెవెన్యూ సహాయకులు మరికొందరు.. మూడేళ్ల క్రితం వీఆర్వోల తొలగింపుతో అన్ని రకాలుగా పని భారంతో ఇబ్బందులు పడుతూ.. చాలీచాలని వేతనాలతో కాలంగడుపుతూ.. ఎప్పటికైనా తమను ప్రభుత్వం గుర్తించక పోదా.. అని ఎదురుచూస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్‌ఏ)ను ప్రభుత్వం క్రమబద్ధీకరిస్తున్నట్లు ప్రకటించడమే కాక.. కార్యాచరణ సైతం ప్రారంభించింది. ఇందులో భాగంగా వీఆర్‌ఏల వివరాలను మూడు రోజుల్లోగా నిర్దేశిత ఫార్మాట్‌లో పంపాలని ఆయా జిల్లాల కలెక్టర్లకు సీసీఎల్‌ఏ నుంచి సోమవారం లేఖలు అందాయి. ఈ మేరకు కలెక్టర్లు తహసీల్దార్లకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో 27 ఏళ్లుగా పడుతున్న కష్టానికి ఫలితం దక్కనుంది. ప్రభుత్వ నిర్ణయంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న 3,536 మంది వీఆర్‌ఏల్లో సంతోషాన్ని నింపింది.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, జోగుళాంబ గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాల్లో మొత్తం 3,536 మంది వీఆర్‌ఏలు పనిచేస్తున్నారు. ఇందులో డైరెక్టు రిక్రూట్‌మెంట్ వీఆర్‌ఏలు 442 మంది ఉండగా.. బ్యాన్ పీరియడ్‌లో నియామకం పొందినవారు దాదాపు 300 మందికిపైగా ఉన్నారు. మిగతా వారు కారుణ్య నియామకాలు, మెడికల్ ఇన్వాలిడేషన్ కింద నియామకం అయ్యారు. కాగా గతంలో పదోన్నతుల విషయంలో జరిగిన తప్పిదాలతో ఇబ్బందులు పడిన వీఆర్‌ఏలు క్రమబద్ధీకరణతో భవిష్యత్‌లో రాబోయే పదోన్నతులు సజావుగా జరిగే అవకాశం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రెవెన్యూ వర్గాల్లో గుబులు

కాగా వీఆర్‌ఏల క్రమబద్ధీకరణతోపాటు ఇతర శాఖల్లో సర్దుబాటు చేయాలనే ప్రభుత్వ ఆలోచన రెవెన్యూ వర్గాల్లో గుబులు రేపుతోంది. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న వీఆర్‌ఏలను ఇతర శాఖల్లో సర్దుబాటు చేస్తే తహసీల్దార్ కార్యాలయాల్లో రెవెన్యూ పరమైన అంశాల్లో క్షేత్రస్థాయి నుంచి పని ఒత్తిడి మరింత పెరుగుతుందని ఆందోళన చెందుతున్నారు. ముందుగా వీఆర్‌ఓ, ఆ తర్వాత వీఆర్‌ఏలను ఈ శాఖ నుంచి ఇతర శాఖలకు సర్దుబాటు చేసే నిర్ణయం రెవెన్యూ యంత్రాంగాన్ని గందరగోళంలో పడేసింది.

ఎంపిక జరిగిన తీరు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే 1993 నవంబర్ 25 నుంచి బ్యాన్ పీరియడ్‌ను ప్రభుత్వం విధించింది. అయితే నిర్దేశించిన తేదీ నుంచి అనుమతి లేకుండా వీఆర్‌ఏల నియామకాలు చేపట్టరాదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రభుత్వ మార్గదర్శకాలు ఉన్నప్పటికీ ఆయా మండలాల తహసీల్దార్లు తమ కార్యాలయాల్లో పనిభారాన్ని చూపుతూ వీఆర్‌ఏలను నియమించుకున్నారు. 2011లో తహసీల్దార్లు నియమించుకున్న వీఆర్‌ఏలను రెగ్యులర్ ఉద్యోగులుగా పరిగణించి వేతనాలు చెల్లించాలని జీఓ 2176ను విడుదల చేసింది. అప్పట్లో ఎంపిక చేసుకున్న వీఆర్‌ఏలు, కారుణ్య నియామకం పొందినవారు, మెడికల్ ఇన్వాలిడేషన్‌పై ఎంపికైన వారందరినీ పరిగణలోకి తీసుకొని తాజా ఖాళీల ఆధారంగా 2012లో ఏపీపీఎస్సీ వీఆర్‌ఏల ఎంపికకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నోటిఫికేషన్ ప్రకారం జిల్లాలో 442 మంది డైరెక్టు రిక్రూట్‌మెంట్ వీఆర్‌ఏలను నియమించారు. వీరితోపాటు గతంలో బ్యాన్ పీరియడ్‌లో ఎంపికైన వారు, కారుణ్య నియామకాలు పొందినవారు, మెడికల్ ఇన్వాలిడేషన్‌పై ఎంపికైన వారు సైతం ప్రస్తుతం సబ్‌ట్రెజరీ ద్వారా వేతనాలు పొందుతున్నారు. 2/95 యాక్టు ద్వారా బేసిక్ పే, కన్సల్టేషన్ పే, కాంటింజెంట్ ఉద్యోగులకిచ్చే చెల్లింపులు వీరికి వర్తించలేదు. వీటన్నింటిని ఆధారంగా చేసుకొని న్యాయస్థానాన్ని, సీసీఎల్‌ఏలను ఆశ్రయించి తమకు న్యాయం చేయాలని బ్యాన్‌పీరియడ్‌లో నియమితులైన వీఆర్‌ఏలు పోరాటం చేయగా మూడేళ్ల క్రితం ఉపశమనం కలిగింది.

వివరాలపై ఆరా..

జిల్లాలు, మండలాల వారీగా ఎంత మంది వీఆర్‌ఏలు (మంజూరు), పనిచేస్తున్న వారు, ఖాళీలు, కేటగిరీ వారీగా ఫార్మాట్‌లో పేర్కొంటూ వివరాలను పంపాలని సూచించారు. వయస్సు ప్రత్యేకించి 17, 18 నుంచి 20 ఏళ్ల గలవారు, అలాగే 21 ఏళ్ల నుంచి ప్రతి 10 సంవత్సరాల గ్యాప్‌తో విడివిడిగా వయస్సుల వారిని పేర్కొంటూ వందేళ్ల వయస్సు దాటిన వారి వివరాలను సైతం పంపాలని ఫార్మాట్‌లో పొందుపర్చారు. విద్యార్హత విడివిడిగా, నియామకం జరిగిన తీరు (డైరెక్టు రిక్రూట్‌మెంట్, కంపాసినేట్ గ్రౌండ్, మెడికల్ ఇన్వాలిడేషన్, 2011 వరకు, ఆ తర్వాత నియమితులైన వారు, తాత్కాలిక పద్ధతి, బ్యాన్ పీరియడ్, ఇర్రెగ్యులర్ నియామకం) వివరాలతో పాటు అప్‌స్కాండింగ్, సస్పెండ్ వంటి వివరాలను సైతం పేర్కొనాలని 47 కాలాలతో కూడిన ఫార్మాట్‌ను సీసీఎల్‌ఏ అధికారులు పంపారు.

సంతోషంగా ఉంది..

ఏళ్లతరబడిగా చేస్తున్న పోరాటాలకు ఫలితం దక్కింది. వీఆర్‌ఓల తొలగింపుతో మాపై పని భారం పడింది. గత మూడేళ్లుగా ఆయా గ్రామాల్లోని రెవెన్యూ సంబంధిత క్షేత్రస్థాయి పనులు మాతోనే నిర్వహిస్తున్నారు. క్రమబద్ధీకరణతో ఉద్యోగ భద్రత దక్కనుంది. ప్రభుత్వ నిర్ణయం మాలో సంతోషాన్ని నింపింది.

– రాధిక, వీఆర్‌ఏ అసోసియేషన్ నాయకురాలు

నివేదిక సిద్ధం చేస్తున్నాం..

వీఆర్‌ఏల క్రమబద్ధీకరణకు సంబంధించి వివరాలు పంపాలని సీసీఎల్‌ఏ నుంచి ఓ ఫార్మాట్‌ను పొందుపరుస్తూ లేఖ వచ్చింది. ఈ మేరకు అన్ని మండలాల వారీగా తహసీల్దార్లను ఆదేశించారు. నిర్దేశిత ఫార్మాట్‌లో వీఆర్‌ఏల వివరాలను సేకరించి సీసీఎల్‌ఏకు నివేదిస్తాం.

– సీతారామారావు, అదనపు కలెక్టర్, మహబూబ్‌నగర్

ఇకచాలు దొర నీ పాలన

- బీఆర్‌ఎస్ పాలనలో ప్రజాధనం లూటీ
- సీఎల్‌పీ నేత భట్టి విక్రమార్క విమర్శ



మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

నవాబుపేట: ఇక చాలు దొరో నీ పాలన అంటూ జనం కోరుకుంటూ తమ అసంతృప్తిని అడుగడుగున వివరించారని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. తాను చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో జనం తమకు జరుగుతున్న అన్యాయం, తాము కోల్పోయిన భూముల విషయమై ఎక్కువగా ఆవేదన వ్యక్తపరిచారన్నారు. పీపుల్స్ మార్చ్ యాత్రకు విరామం ప్రకటించి నవాబుపేట మండలం రుక్కంపల్లిలో విశ్రాంతి తీసుకుంటున్న ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ నియంత పాలనలో ప్రజలు విసిగి పోయారన్నారు. కాంగ్రెస్ పార్టీ గతంలో చేపట్టిన ప్రాజెక్టుల విషయాన్ని కేసీఆర్ ఒకసారి గుర్తు చేసుకోవాలని హితవు పలికారు. పాలమూరు ప్రాజెక్టుకు కాంగ్రెస్ మొదట్లో రూ.10కోట్లు కేటాయించి అడ్మినిస్ట్రేటివ్ మంజూరు ఆర్డర్ ఇచ్చిందని గుర్తుచేశారు. కేసీఆర్ మాత్రం పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో ప్రధానమైన లక్ష్మీదేవిపల్లి ఊసే లేకుండా చేయడం భావ్యం కాదన్నారు. కేవలం డబ్బులు దండుకునేందుకే డిజైన్లు మారుస్తూ ప్రజలకు అన్యా యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్ణాటకలో కాంగ్రెస్ విజయం సాధించడంతో ఇక్కడ కేసీఆర్‌కు నిద్రపట్టడం లేదన్నారు. 2023లో జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచి పాలమూరు బీడు భూములకు నీరు పారించే బాధ్యత తీసుకుంటుందన్నారు. రాష్ట్రంలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ పార్టీకి 90 నుంచి 100 సీట్లు తక్కువ కాకుండా వస్తాయని.. మిగతా 10-15 సీట్లను బీఆర్‌ఎస్ మిగతా పార్టీలు పంచుకుంటాయని పీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి జోస్యం చెప్పారు. సమావేశంలో పీసీసీ నాయకులు మదన్‌మోహన్‌రావు, మల్లురవి, అనిరుధ్‌రెడ్డి, బంగ్లరవి, ఖాజా, జహీర్, రామచంద్రయ్య పాల్గొన్నారు.

నేడు పాదయాత్ర ప్రారంభం

ఐదు రోజుల విరామం అనంతరం మంగళవారం భట్టి విక్రమార్క పాదయాత్ర రుక్కంపల్లి నుంచి ప్రారంభంకానుంది. కాగా భట్టి ఈ నెల 16న మండలానికి చేరుకుని 17 వరకు పాదయాత్ర కొనసాగించారు. 18న అస్వస్థతకు గురైన ఆయన వైద్యుల సూచన మేరకు రుక్కంపల్లిలోనే విశ్రాంతి తీసుకున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం కుదుట పడటంతో మంగళవారం ఉదయం రుక్కంపల్లి నుంచి చెన్నారెడ్డిపల్లి, మల్లారెడ్డిపల్లి, కూచూర్, దొడ్డిపల్లి, కిష్టారం వరకు పాదయాత్ర కొనసాగనుంది. మొత్తం 10 కి.మీ., పాదయాత్ర సాగనుండగా మల్లారెడ్డిపల్లిలో మధ్యాహ్నం భోజన విరామం, కిష్టారం సమీపంలో రాత్రి బసకు ఏర్పాటు చేసినట్లు యాత్ర నిర్వాహకులు పీసీసీ ప్రధాన కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి తెలిపారు.

ఎన్నికల నిర్వహణపై డీజీపీతో వీసీ



వీసీలో మాట్లాడుతున్న ఎస్పీ వెంకటేశ్వర్లు

నారాయణపేట రూరల్: రాబోవు సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా అన్ని జిల్లాల ఎస్పీలతో సోమవారం డీజీపీ అంజనికుమార్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు పాల్గొని జిల్లా వివరాలు వెల్లడించారు. జిల్లాలో మూడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయని, కొడంగల్‌లో కొంతభాగం వికారాబాద్, నారాయణపేటలో కోయిలకొండ మండలం మహబూబ్‌నగర్‌లో, మక్తల్‌లో రెండు మండలాలు వనపర్తి జిల్లాలో ఉన్నాయని తెలిపారు. దాదాపు 13మండలాలు, 280జీపీలు ఉన్నాయని తెలిపారు. వాటికి తగ్గట్లు ప్రతీ విలేజ్‌కు పోలీసును ఏర్పాటు చేశామని చెప్పారు. పోలింగ్ కేంద్రాల పరిశీలన, సమస్యాత్మక గ్రామాల గుర్తింపు చేపట్టినట్లు తెలిపారు. గతంలో ఎదురైన సమస్యలను అధిగమించేందుకు తగిన ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. అధికారులంతా సమన్వయంతో ఎన్నికలను విజయవంతంగా పూర్తి చేయడానికి కృషి చేస్తామని చెప్పారు. గ్రామాల్లో జరుగుతున్న కార్యక్రమాలు, సమావేశాలపై దృష్టి పెట్టామని, పాత, కొత్త నేరస్తులపై నిఘా కొనసాగిస్తున్నామని, ఎన్నికల వేళ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఇక బార్డర్ చెక్‌పోస్టులు పటిష్టంగా అమలుచేస్తూ కర్ణాటక నుంచి మద్యం, డబ్బులు, దొంగ ఓటర్లు రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అడిషనల్ ఎస్పీ నాగేంద్రుడు, డీఎస్పీ సత్యనారాయణ, ఎస్ఐలు, ఎస్‌బీ సిబ్బంది పాల్గొన్నారు.

‘ఉపాధి’ చట్టాన్ని నీరుగారుస్తున్న కేంద్రం

నారాయణపేట: ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్.వెంకట్రాములు విమర్శించారు. జిల్లా కేంద్రంలో జరిగిన ఉపాధి కూలీల జిల్లా ధర్నాకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చట్టాన్ని కాపాడుకునేందుకు కూలీలు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఉపాధి హామీ పథకానికి బీజేపీ ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు తగ్గిస్తూ పథకం ఎత్తి వేసేందుకు కుట్ర పన్నుతోందన్నారు. బిల్లులు సకాలంలో అందక కూలీలు ఇబ్బందిపడుతున్నారు. పని ప్రదేశాల్లో టెంట్లు, మెడికల్ కిట్లు, పనిముట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ఏడాది పనిచేసిన కూలీలకు డబ్బులు అందలేదని జిల్లా కార్యదర్శి గోపాల్ అన్నారు. అనంతరం ఈజీఎస్ ఏపీడీ అంజయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్మిక, వ్యవసాయ సంఘాల నాయకులు బాలప్ప, వెంకటరామరెడ్డి, అంజయ్య, శివకుమార్, వెంకటేశ్, జోషి అశోక్, లక్ష్మయ్య గౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకట్రాములు

క్లుప్తంగా

ప్రమాదవశాత్తు వృద్ధుడి మృతి

ఉండవెల్లి: ఓ వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్‌ఐ బాల్‌రాజు తెలిపిన వివరాలు.. మెన్నిపాడు గ్రామానికి చెందిన ఈదన్న(72) ఈనెల 18న రాత్రి సమయంలో కల్లంలో మొక్కజొన్న ధాన్యానికి కావలి ఉన్నాడు. తెల్లవారుజామున పడుకున్న చోటే బీడీతాగి పక్కకు వేశాడు. అది ఎండుగడ్డి పైన పడడంతో నిప్పంటుకుంది. ఆ మంటల్లో అతను గాయపడ్డాడు. చుట్టుపక్కల ఉన్న తిక్కస్వామి అనే వ్యక్తి చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. వారు వృద్ధున్ని కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. సోమవారం వృద్ధుడి పెద్ద కుమారుడు లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ బాల్‌రాజు తెలిపారు.

బావిలో దూకి..

బిజినేపల్లి: తిమ్మాజీపేట మండలంలోని నేరళ్లపల్లికి చెందిన మీసాల జానకి రాములు(35) బావిలో ఈత కోసం దూకి మృత్యువాత పడ్డాడు. ఈ దుర్ఘటన సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. జానకిరాములుకు ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. వారు బావిలో ఈత కొడుతుండగా జానకిరాములు వారితో పాటు సరదాగా బావిలోకి దూకాడు. నీటిలో మునిగి, ఎంతకూ బయటికి రాలేదు. కూతుళ్లు కేకలు వేయడంతో స్థానికులు వచ్చి గాలించినా దొరకలేదు.

పిడుగుపడి గొర్రెపిల్లలు మృతి

గోపాల్‌పేట: పిడుగుపడటంతో 13 గొర్రెపిల్లలు మృతిచెందాయి. ఈ ఘటన వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలోని బుద్దారంలో సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు.. బుద్దారం గ్రామానికి చెందిన సిద్ది రాములు కుమారుడు సిద్ది చిన్నయ్య ఇటీవ లక్ష రూపాయలు వెచ్చించి పది గొర్రెపొడేళ్లు, మూడు గొర్రెపిల్లలు కొన్నాడు. ఎప్పటిలాగే దొడ్డిలో ఆదివారం రాత్రి కట్టేశాడు. సోమవారం ఉదయం ఆరు గంటల ప్రాంతంలో పిడుగుపడింది. అక్కడే ఉన్న పొడేళ్లు, గొర్రెలు అన్నీ మృతిచెందాయి. కొన్నాళ్ల క్రితమే లక్ష రూపాయలకు పైగా అప్పుచేసి కొన్నానని యజమాని రోదించాడు. తనను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈవిషయమై మండల పశువైద్యాధికారి ఉదయ్‌కుమార్‌రెడ్డిని వివరణ కోరగా, సంఘటన జరిగిన ప్రాంతాన్ని పరిశీలించామని, పంచనామా నిర్వహించామని తెలిపారు.

పిడుగుపడి కొబ్బరిచెట్టు దగ్ధం

దామరగిద్ద: మండలంలోని గడిమున్కన్‌పల్లిలో సోమవారం తెల్లవారుజామున పిడుగుపడి కొబ్బరి చెట్టు పూర్తిగా దగ్ధమైంది. మంటలను గుర్తించిన కొందరు గ్రామస్తులు ఆర్పేందుకు ప్రయత్నించారు.

స్కూల్ బస్సు దగ్ధం



జడ్చర్ల: స్థానిక అక్షర కాన్సెప్ట్ స్కూల్ బస్సు దగ్ధమైన ఘటన ఆదివారం పట్టణంలో చోటుచేసుకుంది. పాఠశాల యాజమాన్యం కథనం మేరకు.. పట్టణంలోని పద్మావతికాలనీలో అద్దె భవనంలో కొనసాగుతున్న పాఠశాల ఆవరణలో విద్యార్థులను తరలించే మూడు బస్సులను నిలిపి ఉంచారు. సోమవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో బస్సులో నుంచి పొగలు వచ్చి మంటలు ఎగిసిపడటంతో చుట్టుపక్కల వారు గుర్తించి వెంటనే పక్కనే ఉన్న బోరుమోటారు నీటితో మంటలను ఆర్పారు. పక్కనే ఉన్న రెండు బస్సులను అక్కడి నుంచి దూరంగా తరలించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మిగిలిన మంటలను ఆర్పారు. చింతచెట్ల కింద నీడన ఉన్న బస్సుకు ఎలా నిప్పంటుకుందన్న దానిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. షార్ట్‌సర్క్యూట్ జరిగిందా లేదా ఎవరైనా కావాలనే నిప్పంటించారా అన్న విషయం తెలియడం లేదని కరస్పాండెంట్ అనురాధ తెలిపారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు వివరించారు. అగ్నిమాపక అధికారి మల్లికార్జున్ వివరాలు సేకరించారు.

ఫ్యాక్టరీ మూసివేతకు ఎమ్మెల్యే మద్దతు



మహమ్మదాబాద్: మండల పరిధిలోని దేశాయిపల్లి చౌరస్తాలో నెలరోజులుగా నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులకు పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి మద్దతుగా నిలిచారు. ఈమేరకు ఆయన స్పందిస్తూ గ్రామస్తుల తరఫున టీఎస్ ఏఐడీసీ ఎండీ వెంకట్‌నర్సింహారెడ్డిని కలిసి సమస్యను వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. స్థానిక ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ఫ్యాక్టరీని వెంటనే మూసివేయాలని కోరారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందిస్తూ చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి గండేడ్ మండల జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మహమ్మదాబాద్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బిక్షపతి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు వెంకటేశం పాల్గొన్నారు.

మైమరిపించే.. మామిడి

మార్కెట్‌లో 'కొల్లాపూర్' పండ్లకు ప్రత్యేక స్థానం

- సాటిలేని రుచులతో గల్లీ నుంచి ఢిల్లీ దాకా ఖ్యాతి
- గతంలో దాదాపు 120 రకాల తోటల సాగు
- ప్రస్తుతం స్థానిక తోటల్లో 50 వరకు రకాలు



పండ్లలో మహారాజుగా పేరుగాంచిన మామిడి అంటే ఎవరికైనా నోరూరకమానదు. చాలామందికి తెలిసి మామిడి, కోతమామిడి, కారం కాయలు వంటివి కొన్నిరకాలు మాత్రమే ఉంటాయని అనుకుంటాం. మార్కెట్‌లో మహా అంటే మరో పది నుంచి పదిహేను రకాల పండ్లు అందుబాటులో ఉంటాయి. అయితే నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో 120 రకాల మామిడి పండ్లు లభిస్తాయి అంటే నమ్ముతారా.. కానీ, ఇది ముమ్మాటికి నిజం. సురభి రాజులు తమ తోటల్లో వంద రకాల మామిడి మొక్కలు నాటగా.. చాలాకాలం అవి పండ్లు అందించాయి. ఇందులో కొన్ని రకాలు ఇప్పుడు లభించకున్నా.. చాలా వరకు రుచులను ఆస్వాదించొచ్చు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఖ్యాతిగడించిన కొల్లాపూర్ ప్రాంతంలో సాగవుతున్న మామిడి తోటల రకాలు.. అయా పండ్ల ప్రత్యేకతలపై కథనం..

– 'సాక్షి' మహబూబ్‌నగర్ డెస్క్

కొల్లాపూర్‌ను సురభిరాజ వంశస్తులు వందలాది ఏళ్లు పాలించారు. శతాబ్దంన్నర క్రితమే సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగంలోకి తీసుకొచ్చి కొల్లాపూర్ సంస్థానాన్ని అభివృద్ధికి చిరునామాగా తీర్చిదిద్దారు. ఉద్యానవనాల పెంపకంలో కూడా తమదైన ప్రత్యేకతను చాటుకున్నారు. బొబ్బిలి రాజవంశాలతో సురభిరాజులకు బంధుత్వం ఉండడంతో అక్కడి నుంచి రాజా వెంకటలక్ష్మారావు మామిడి మొక్కలను తెప్పించి ఎల్లారు సమీపంలోని తన పొలంలో నాటించారు. దీనినే రాజా గారి పెద్దతోట అని పిలుస్తారు. ఈ తోటలో గతంలో వందకు పైగా మామిడి రకాలు ఉండేవి. వయసు మీరడంతో చాలా చెట్లు మోడువారిపోయాయి. కలెక్టర్, రాణిపసంద్ వంటి చెట్లు ఇంకా సజీవంగానే ఉన్నాయి. ఇదే తోటలో వందలాది మామిడి మొక్కలను ప్రస్తుత రాజవంశీయులు బాలాదిత్య లక్ష్మారావు నాటించారు. అలాగే రాజు గారి ఆస్థానంలో మంత్రిగా పనిచేసిన దూరయ్య కూడా మామిడి తోట సాగు చేయగా.. దీనిని చిన్న తోట, రాణిగారి తోటగా పిలుస్తారు. సురభి సంస్థానంలో ఇంజినీర్లుగా పనిచేసిన తూర్పు వంశస్తులు కూడా అప్పట్లో మామిడి తోటలు సాగు చేశారు. చుక్కాయిపల్లి సమీపంలోని కృష్ణవిలాస్ కూడా మొదటితరం తోటల్లో ఒకటి. ఫలరాజుగా పేరొందిన మామిడి సీజన్ ప్రస్తుతం కొనసాగుతోంది. కొల్లాపూర్ ప్రాంతంలో బాగా ప్రాచుర్యం పొందిన కొన్ని మామిడి రకాలు మీకోసం అందిస్తున్నాం.



నాటు మామిడి

ఈ పండ్లు సాధారణంగా అన్ని చోట్ల దొరుకుతుంటాయి. వీధుల్లో తిరిగి వీటిని విక్రయిస్తుంటారు. చిల్లర మామిడిలో ఇవి ఒక రకం.

బేనీషాన్

మార్కెట్లో అధికంగా లభించే పండ్లు ఇవే. తీపి రుచిని కలిగి ఉంటాయి. మంచి రంగు కూడా ఉంటుంది.



ఎర్ర నీలిషాన్

మామిడి కాయలపై ఎరుపు రంగు కలర్ ఉంటుంది. ఇవి తీపి, పులుపు రుచులు కలిపి ఉంటాయి. ఆకర్షణీయంగా కనిపిస్తాయి.





తెల్ల నీలిషాన్

బేనీషాన్ మాదిరిగానే ఉంటాయి. ఇవి జూన్ నెలలో పండ్లు అవుతాయి. మామిడి పంటల సీజన్ చివరలో కాపు వస్తుంది. చెట్లకు కాపు అధికంగా ఉంటుంది.



చెరుకురసం

తీపి అధికంగా ఉంటుంది. ఇవీ రసం పండ్లు ఇవి. పీచు మాత్రం ఉండదు.

సాల్వార్ సమాన్

ఈ పండ్లు ఒక్కొక్కటి కేజీకి పైగా ఉంటాయి. ఒక్క పండు 3 కేజీల వరకూ పెరుగుతుంది. రుచి మామూలుగానే ఉంటుంది.





మల్‌గుబా

బేనీషాన్ తర్వాత అధికంగా దొరికే పండు. దీన్ని చెట్నీలు, ఊరగాయలకు వాడుతారు. కాయగా ఉన్నప్పుడు పులుపుగా, పండు అయ్యాక తీపిగా ఉండడం దీని ప్రత్యేకత.

మల్లిక

ఈ పండు తోలు అరటిపండు మాదిరిగా తీయగానే మొత్తం వచ్చేస్తుంది. పండ్లే తీపిగా ఉంటాయి. కొంచెం మందంగా ఉంటుంది. వీటిని ఎక్కువగా తినలేరు.



కలెక్టర్ మామిడి

మామిడి రకాల్లో హైక్వాలిటీ పండ్లలో ఇవి ఒకటి. ఈ పండ్లు మార్కెట్లో తక్కువగా దొరుకుతాయి. అద్భుతమైన తీపి రుచిని కలిగి ఉంటాయి.





పునాస మామిడి

ఇవి సంవత్సరంలో రెండు కాలాలు పండుతాయి. చెట్నీలకు, తినడానికి రెండు రకాలుగా వీటిని ఉపయోగిస్తారు.

తోతాపరి

ఇవి సాధారణస్థాయిలో తీపి రుచిని కలిగి ఉంటాయి. వీటికి పెద్దగా డిమాండ్ ఉండదు.





సుబేదాన్

తీపి రకం పండ్లలో ఇవి కూడా ఒకటి. తీపి అధికంగా ఉంటుంది. పండ్లలో కండ ఎక్కువగా ఉంటుంది.

సోర మామిడి

ఇవి రూపంలో చాలా బాగుంటుంది. తీపిలో మాత్రం పులుపును అధికంగా కలిగి ఉంటుంది. మామిడి పులుసు చేసుకునేందుకు వినియోగిస్తుంటారు.





పెద్ద ఆచారి

మామిడి పచ్చళ్లకు ఈ కాయ స్పెషల్. వీటితో చట్నీలు సూపర్‌గా ఉంటాయి. ఇవి పండ్లు అయితే తీపిగా కూడా ఉంటాయి. తీపి, పులుపు కలయిక ఉంటుంది.

సౌందర్య మామిడి

చిన్నరసం మామిడి పండ్లలో ఇవి ఒకటి. కాయపై గులాబీ రంగు ఉంటుంది. స్వీటు అధికంగా ఉంటుంది. నార, పీచు తక్కువగా ఉంటుంది.





తుకం బేనీషాన్

బేనీషాన్ పండ్ల మాదిరిగానే తీపిగా ఉంటాయి. వీటిలో రసంతో కూడిన కండ ఉంటుంది. రసం పండు కింది భాగంలో అధికంగా ఉంటుంది.

బంగారు మామిడి

ఇవి రసం పండ్లు. వీటిలో పీచు తక్కువగా ఉంటుంది. తీయ్యదనం ఎక్కువగా ఉంటుంది.





దిల్ పసంద్

బేనీషాన్ మాదిరిగా ఉంటాయి. కొంచెం పొడవుగా ఉంటాయి. వీటిలో తీపి అధికంగా ఉంటుంది.

దద్దోడ

ఇది రసం పండు. కాయపై గుల్లలు ఉంటాయి. తీపి మామూలుగా ఉంటుంది. పీచు అధికంగా ఉంటుంది.





లడ్డూ మామిడి

ఈ పండ్లు చిన్నవిగా, లడ్డూ మాదిరిగా ఉంటాయి. పండ్లు కండతో ఉంటాయి. తీపి అధికంగా ఉంటుంది.

లాల్‌గజ్జె

ఇవి కోతపండ్లు, రసంగా కూడా ఉంటాయి. బేనీషాన్ తరహాలో తీపి ఉంటుంది. ఇవి గుత్తులుగా కాస్తాయి.





జొన్నల రాశి

కాయలు చిన్నవిగా ఉంటాయి. రసం పండ్లు. రుచి తీపిగా ఉంటుంది. పీచు ఉంటుంది.

మాన్‌కాల్

ఇవి కూడా రసం పండ్లు, తినడానికి, చెట్నీలకు వినియోగిస్తారు. రుచి బాగుంటుంది.





పంచధార

ఇవి చాలా తీపిగా ఉంటాయి. వీటిని కాయలుగా ఉన్నప్పుడు చట్నీలకు కూడా వాడతారు. రసం పండ్లు ఇవి.

మోతీమోని పసంద్

ఈ పండ్లు ఎక్కువ బరువు తూగవు. తీపి బాగుంటుంది. రసం పండ్లు ఇవి, పీచు మాములుగా ఉంటుంది.





పాన్‌కాల్

ఇవి రసం పండ్లు, కానీ కాయలుగా ఉన్నప్పుడు చట్నీలకు కూడా వాడతారు.

నూజివీడు

ఇవి పుల్లగా ఉంటాయి. చట్నీలకు ప్రత్యేకమైనవి. వీటి ధర కాయల ఉత్పత్తిని బట్టి పెరగుతూ, తగ్గుతూ ఉంటుంది.



దేసేరి

ఇవి చిన్నసైజులో ఉంటాయి. కానీ రుచిలో దీనికి తిరుగులేదు.పీచు సాధారణంగా ఉంటుంది. రసం పండ్లు తినేవారు ఈపండును ప్రత్యేకంగా తెప్పించుకుని తింటారు.



వీటితో పాటు రాణిపసంద్, కాలమిశ్రీ, చిన్న రసాలు, పెద్ద రసాలు, హిమాయత్, జహంగీర్ పసంద్, రామ్‌గోళా, సోగి, అబ్బాస్, తెల్ల అమీన్, కబ్బా పసంద్, ఎర్ర అరటి, పంచదార కలశ, సురంజి లడ్డు, కొత్తపల్లి కొబ్బెర, నాగులపల్లి ఇడ్సాల్, అదావత్ ఇడ్సాల్, అమ్మచెట్టు, నీల్ గోవా, గోబందర్ వంటి రకాల మామిడి చెట్లు కొల్లాపూర్‌లో ఉన్నాయి. మామిడి రకాల్లో ఒకప్పుడు 120 రకాల చెట్లు సురభి రాజులకు చెందిన ఎల్లూరు పెద్ద తోటలో ఉండేవి. ప్రస్తుతం 50 రకాల వరకూ అందులో ఉన్నాయి. రాణి పసంద్ చెట్టు పెద్ద తోటతో పాటు కొన్ని ప్రాంతాల్లో మాత్రమే ఉన్నాయి.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

గండేడ్: గ్రామాల్లో అడవి జంతువులు సంచరిస్తున్న ఆనవాళ్లు కనిపిస్తున్నాయని, వాటి పట్ల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎఫ్‌ఆర్‌ఓ మగ్దూం ఉస్సేన్ అన్నారు. సోమవారం మండలంలోని కొండాపూర్ అటవీ ప్రాంతాన్ని ఆయన అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో చిరుతపులి సంచరిస్తున్న ఆనవాళ్లు కనిపిస్తున్నాయని, పొలాలకు వెళ్లే రైతులు జాగ్రత్తగా ఉండాలని, గుంపులుగా పొలాలకు వెళ్లాలని సూచించారు. చెట్లు నకడం వల్లనే అడవుల శాతం తగ్గి వన్యప్రాణులు జన సంచారంలోకి వస్తున్నాయన్నారు. త్వరలోనే అటవీ ప్రాంతాన్ని సర్వే చేసి బౌండరీలు ఏర్పాటు చేస్తామన్నారు. అడవి భూమిని రైతులు ఆక్రమించరాదని, అలా చేసే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సెక్షన్ ఆఫీసర్ నర్సింహులు, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న అటవీ శాఖ అధికారులు

1,203 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి సోమవారం 1,203 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా.. ప్రాజెక్టులో 7.279 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 150 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

శ్రీశైలంలో నీటిమట్టం 809.9 అడుగులు

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో సోమవారం నీటిమట్టం 809.9 అడుగులు, 34.2438 టీఎంసీల నీటి నిల్వ ఉంది. గడిచిన 24 గంటల వ్యవధిలో ఎంజీకేఎల్ ఐకు నీటి విడుదల జరగలేదు. ఎండ తీవ్రత వలన జలాశయంలో 228 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

టాస్క్‌ఫోర్స్ అధికారుల దాడులు



రాణిపేటలో విత్తన ప్యాకెట్లను పరిశీలిస్తున్న రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ బృందం

జడ్చర్ల: రాష్ట్ర వ్యవసాయశాఖ టాస్క్‌ఫోర్స్ అధికారులు సోమవారం పట్టణంలోని విత్తన దుకాణాలు, గోదాములపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. పత్తి విత్తనాలకు హెచ్‌టీ పరీక్షలు చేశారు. రికార్డులు, లైసెన్స్‌లు, బిల్‌బుక్‌లు, నిల్వ రిజిస్టర్లు పరిశీలించారు. అదేవిధంగా ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఇతర ప్రాంతాల నుంచి నకిలీ విత్తనాలు వచ్చే అవకాశం ఉందని.. స్థానిక అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతులకు విధిగా పూర్తి వివరాలతో కూడిన బిల్లులు ఇవ్వాలని విత్తన దుకాణదారులను ఆదేశించారు. అంతేగాక విత్తన ధరలను బోర్డులపై పెద్ద అక్షరాలతో రాయించాలని, నాణ్యత లేని, ప్రభుత్వ గుర్తింపులేని విత్తనాలను రైతులకు విక్రయిస్తే పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. దాడుల్లో రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ అధికారి సుధారాణి, ప్రసన్న, ఎస్‌ఐ రవికుమార్, జడ్చర్ల ఏడీఏ అంజనేయులు, ఏఓ గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మిడ్జిల్ మండలంలో..

మిడ్జిల్: మండల కేంద్రంలోని మన గ్రోమోర్, రాణిపేటలోని అజయ్ ట్రేడర్స్‌ను సోమవారం రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ బృందం ఆకస్మికంగా తనిఖీ చేసింది. నిల్వ రిజిస్టర్లు, బిల్లు బుక్స్ పరిశీలించారు. పత్తి విత్తనాలకు హైబ్రిడ్ టాలరెంట్ పరీక్షలు నిర్వహించారు. విత్తన డీలర్లు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని టాస్క్‌ఫోర్స్ టీం ఏడీఏ సుధారాణి హెచ్చరించారు. గ్రామాల్లో లైసెన్స్ లేకుండా విత్తనాలు అమ్మినా, లూజు పత్తి విత్తనాలు విక్రయించిన కేసులు నమోదు చేస్తామన్నారు. తనిఖీల్లో సీడ్ సర్టిఫికెట్స్ అధికారి ప్రసన్న, సీఐ రవికుమార్, ఏఓ సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

రేపు పాలెంలో విత్తనమేళా

- ఆర్‌ఏఆర్‌ఎస్‌లో నాణ్యమైన విత్తనాలు
- ఏడీఆర్ మల్లారెడ్డి



మాట్లాడుతున్న ఏడీఆర్ మల్లారెడ్డి.. చిత్రంలో శాస్త్రవేత్తలు

బిజినేపల్లి: ఉమ్మడి జిల్లాలోని చాలా ప్రాంతాల్లో రైతులు దుక్కులు దున్ని పొలాలను సాగుకు సిద్ధం చేసుకున్నారని.. భూమి చలువకు వచ్చిన తర్వాతే నాణ్యమైన విత్తనాలు విత్తుకోవాలని పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ మల్లారెడ్డి అన్నారు. ఆదివారం పాలెం ఆర్‌ఏఆర్‌ఎస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బుధవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 6 వరకు ఆర్‌ఏఆర్‌ఎస్‌లో విత్తనమేళా నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. వరి, కంది, పెసర, మినుము, ఆముదం, వేరుశనగ, జొన్న విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ ఏడాది రైతులు పచ్చజొన్న విత్తనాన్ని ఎక్కువగా అడుగుతున్నారని.. అవసరం మేర పంపిణీ చేస్తామని తెలిపారు. నాణ్యమైన విత్తనం విత్తడంతో అధిక దిగుబడులు వస్తాయని.. వచ్చిన దిగుబడిని మూడుసార్లు విత్తనంగా వాడుకోవచ్చన్నారు. పాలెం కేవీకే, ఆర్‌ఏఆర్‌ఎస్‌ల ఆధ్వర్యంలో దూర ప్రాంతాల రైతులు తమకు కావాల్సిన విత్తనాన్ని అధికారులకు ఫోన్‌లో ఆర్డర్ చేస్తే దగ్గరలోని ట్రాన్స్‌పోర్టు కార్యాలయాలకు డెలివరీ అందిస్తామని వివరించారు.

అందుబాటులో ఉన్న విత్తనాలు..

- వరిలో ఆర్ఎన్ఆర్15048 (తెలంగాణ సోన), కేపీఎస్ 2874, కేఎన్ఎం 1638 (కూనారం వరి) రకాలు ఉన్నాయని 20 కిలోల సంచి రూ.880కి లభిస్తుందన్నారు. ఆముదంలో పీసీహెచ్–111 రకం 2 కిలోల బ్యాగు రూ.700 ఉంటుందని ఈ విత్తనాల కోసం సెల్‌ఫోన్ నంబర్ 88853 31799 సంప్రదించాలని సూచించారు.
- తెల్లజొన్నలో సీఎస్‌వీ–41 రకం 3 కిలోల బ్యాగు రూ.270, పచ్చజొన్నలో పీవైపీఎస్–2 రకం 3 కిలోల బ్యాగు రూ.450కు లభిస్తుందని, అవసరం ఉన్న రైతులు సెల్‌ఫోన్ నంబర్ 89782 29445 సంప్రదించాలన్నారు.
- కందిలో పీఆర్‌జీ 176 రకం 3 కిలోల సంచి రూ.390 ఉంటుందని, విత్తనం కావాల్సిన రైతులు సెల్‌ఫోన్ నంబర్ 62811 21529 సంప్రదించాలన్నారు.
- మినుములో పీయూ 31 రకం 6 కిలోల సంచి రూ.780, రాగిలో పీఆర్ఎస్–38 రకం రెండు కిలోల సంచి రూ.150కి లభిస్తుందని, విత్తనం కావాల్సిన రైతులు సెల్‌ఫోన్ నంబర్ 89197 77028 సంప్రదించాలని వివరించారు.

కురుమూర్తిస్వామి హుండీ లెక్కింపు



చిన్నచింతకుంట: మండలంలోని అమ్మాపురంలో వెలసిన కురుమూర్తిస్వామి దర్శనానికి అమావాస్య, శని, సోమవారాలను పురస్కరించుకొని తరలివచ్చిన భక్తులు కానుకలుగా సమర్పించిన హుండీని ఆలయ అధికారులు సోమవారం లెక్కించారు. స్వామివారి హుండీ ఆదాయం రూ.6,72,549 వచ్చినట్లు ఆలయ ఈఓ మదనేశ్వర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

యోగా బ్రహ్మోత్సవంలో పాల్గొనండి

స్టేషన్ మహబూబ్‌నగర్: హైదరాబాద్‌లోని సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ నెల 27న యోగా బ్రహ్మోత్సవం నిర్వహిస్తున్నట్లు భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ జిల్లాశాఖ అధ్యక్షుడు కె.వెంకట్రాముడు తెలిపారు. జిల్లాకేంద్రంలోని పతంజలి యోగా సమితి కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యోగా బ్రహ్మోత్సవంలో అన్ని యోగా సంస్థలు, అభ్యాసకులు, ఆధ్యాత్మిక సంస్థలు పాల్గొనాలని కోరారు. 27న తెల్లవారుజామున 3 గంటలకు జిల్లాకేంద్రంలోని ఎల్లమ్మగుడి, మెట్టుగడ్డ, ఏనుగొండ వద్ద బస్సులను ఏర్పాటు చేసినట్లు, ఆసక్తిగల వారు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో పతంజలి యోగా సమితి ప్రతినిధులు గంగాధర్, బాల్‌నర్సింహులు, దయానంద్, దత్తురావు, జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు సురేష్, సాయికుమార్, జగదీష్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

కేసీఆర్, కేటీఆర్ అండతోనే ఎదిగావు

పొంగులేటిపై మంత్రి పువ్వాడ ఫైర్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: 'ఐదు నెలల క్రితం వరకు బీఆర్ఎస్‌లో ఉండి.. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ను పొగిడి వేల కోట్ల కాంట్రాక్టులు సంపాదించుకున్నావు.. వారి అండతోనే ఎదిగావు. ఇప్పుడు డబ్బు ఉంది కదా అని విర్రవీగుతున్నావు' అని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సోమవారం ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశాక పువ్వాడ మాట్లాడారు. 2016లో టీఆర్ఎస్‌లో చేరినప్పుడు పొంగులేటి ఆర్థిక పరిస్థితి, కంపెనీ టర్నోవర్ ఎంతో గుర్తు చేసుకోవాలన్నారు. ఎన్ఎస్‌పీ లెఫ్ట్ కెనాల్ ఆధునీకరణ పనులను తూతూ మంత్రంగా చేపట్టి వందల కోట్లు దండుకున్నారని, దీనిపై నమోదైన ఫిర్యాదులో విజిలెన్స్ నివేదిక ఇవ్వడంతో తప్పించుకోవడానికే రాజకీయాల్లోకి వచ్చారని విమర్శించారు. ఆ కేసులన్నీ ఇప్పటికీ అలాగే ఉన్నాయని గుర్తు చేశారు. నిన్నటి వరకు పార్టీ పెడతానని, ఆ పార్టీ, ఈ పార్టీ నేతలు తనతో టచ్‌లో ఉన్నారంటూ మాట్లాడారన్నారు. పొంగులేటి కాంగ్రెస్‌లోకే వెళ్తారని, ఆ పార్టీలోకి వెళ్లాక కేసీఆర్ విలువ ఏమిటో ఆయనకు తెలుస్తుందని పువ్వాడ అన్నారు. టీఆర్ఎస్‌లో ఉండి పార్టీ అభ్యర్థులను ఓడించిన ఘన చరిత్ర పొంగులేటిదని విమర్శించారు. 2018 ఎన్నికల్లో ఆయన చేసిన నిర్వాకానికే 2019 ఎన్నికల్లో కేసీఆర్ ఆయనకు టికెట్ ఇవ్వలేదని, పద్ధతి మార్చుకోవాలని కేసీఆర్ చెప్పినా మార్పురాలేదన్నారు. ఖమ్మం జిల్లా రాజకీయాల్లో పొంగులేటి పిట్టలదొర అని ఘాటుగా విమర్శించారు. ఐదేళ్లు ఎంపీగా ఉండి ఖమ్మం జిల్లా అభివృద్ధికి ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు.

తెయూ ఈసీ మెంబర్లకు లాయర్ నోటీసులు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ వీసీ డి.రవీందర్‌గుప్తా లాయర్ పేరిట 11 మంది పాలకమండలి (ఈసీ) సభ్యులకు సోమవారం నోటీసులు వచ్చాయి. స్థానికంగా ఉన్న సభ్యులు నోటీసులు తీసుకోగా, మిగిలినవారు ఇంకా తీసుకోలేదు. ఈసీ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. 2023 ఏప్రిల్ 19న జరిగిన 55వ ఈసీ సమావేశంలో పాల్గొన్న కళాశాల విద్యా కమిషనర్ నవీన్‌మిట్టల్, ఆర్థికశాఖ డిప్యూటీ డైరెక్టర్ చంద్రకళతో పాటు హాజరైన 8 మంది ఈసీ మెంబర్లు, ఈసీ తీర్మానంతో రిజిస్ట్రార్‌గా నియామకమైన ప్రొఫెసర్ యాదగిరికి నోటీసులు వచ్చాయి. 55వ ఈసీ సమావేశాన్ని వీసీ రవీందర్‌గుప్తా వాకౌట్ చేసిన తర్వాత, రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ వాకాటి కరుణ చైర్మన్‌గా వ్యవహించారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా ఉన్న విద్యావర్ధినిని గుర్తించబోమని, ప్రొఫెసర్ యాదగిరి రిజిస్ట్రార్‌గా రెండేళ్ల పాటు కొనసాగుతారని, అలాగే వీసీపై చర్యలు తీసుకోవాలని ఈ సమావేశంలో తీర్మానించారు. దీంతో 55వ ఈసీ తీర్మానాలను రద్దు చేయాలని కోరుతూ వీసీ హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు మధ్యంతర రద్దు ఉత్తర్వులు జారీ చేసింది. అనంతరం ఏప్రిల్ 26న 56వ, మే 5న 57వ, మే 12న 58వ ఈసీ సమావేశాలు నిర్వహించారు. అయితే హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల తర్వాత నిర్వహించిన ఈసీ సమావేశాలు, తీర్మానాలు అన్నీ చట్టవిరుద్ధమని, వాటిని వెంటనే రద్దు చేసుకోవాలని నోటీసుల్లో పేర్కొన్నారు. తెయూ ఎస్‌బీఐకి మెయిల్ చేసే అధికారం నవీన్‌మిట్టల్ పీఏకు లేదని, ఈసీ సమావేశాల్లో వీసీపై చేసిన తీర్మానాలు రద్దు చేసుకోకపోతే.. కోర్టు ధిక్కరణ కేసు నమోదు చేయాల్సి ఉంటుందని నోటీసుల్లో పేర్కొన్నట్లు తెలిపారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ సెక్రటరీ వాకాటి కరుణకు, కార్యదర్శి నవీన్‌మిట్టల్‌కు సమాచారం ఇచ్చినట్లు ఈసీ మెంబర్లు తెలిపారు. ఈ నెల 25న జరగనున్న సమావేశంలో నోటీసులపై చర్చించే అవకాశం ఉందన్నారు.

ఎల్లో మీడియా ఓవరాక్షన్

ఎంపీ అవినాశ్‌రెడ్డిని అరెస్టు చేయబోతున్నారంటూ తప్పుడు కథనాలు

సాక్షి ప్రతినిధి, కర్నూలు: మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డిని అరెస్టు చేయబోతున్నారంటూ సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎల్లో మీడియా ఓవరాక్షన్ చేసింది. తీవ్ర అనారోగ్యంతో ఆస్పత్రిలో ఉన్న తల్లి శ్రీలక్ష్మి బాగోగులు చూసుకుంటున్న అవినాశ్ పట్ల కనీస మానవత్వాన్ని కూడా మరిచి ఎల్లో మీడియా అమానుష ధోరణిని బయటపెట్టుకుంది. సీబీఐ అధికారులు సోమవారం కర్నూలుకు రావడంతో అదే అదనుగా రెచ్చిపోయింది. అవినాశ్‌ను ఎలాగైన అరెస్టు చేయించాలన్న విపరీత ధోరణి, కర్నూలు నగరంలో ఉద్రిక్తతలు సృష్టించాలన్న వ్యూహంతో క్షణక్షణం అసత్య ప్రచారంతో హోరెత్తించింది. గంట గంటకు ఎల్లో మీడియా పిచ్చి ముదిరి, మధ్యాహ్నానికి పీక్స్‌కు చేరుకొంది. స్థానిక పోలీసులు సహకరించడంలేదని, మధ్యాహ్నానికి కర్నూలుకు కేంద్ర బలగాలు వస్తున్నాయని, ఆ వెంటనే సీబీఐ అధికారులు అవినాశ్‌ను అరెస్టు చేస్తారంటూ తప్పుడు ప్రచారాన్ని ముమ్మరం చేసింది. ఎల్లో మీడియా విపరీత ధోరణిని రాష్ట్రవ్యాప్తంగా పలువురు తప్పుపట్టారు. తల్లి ఆరోగ్యం బాగోలేక బాధలో ఉన్న వ్యక్తిపట్ల అమానవీయంగా వ్యవహరించడాన్ని వైఎస్సార్‌సీపీ శ్రేణులు, సభ్య సమాజం ఖండించాయి. ఒక ఎంపీకి ఉండే హక్కులు, ఆయన ప్రైవసీని భంగపరిచే విధంగా పచ్చ పైత్యాన్ని వెళ్లగక్కుతున్నాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వంపై బురదజల్లే కుట్రలో భాగంగానే వైఎస్ అవినాశ్‌రెడ్డి లక్ష్యంగా ఎల్లోమీడియా ఈ దుర్నీతికి పాల్పడుతోందని స్పష్టమవుతోంది. అందులో భాగంగానే అర్ధరాత్రి వేళ ఆస్పత్రిలోకి చొరబడుతున్నారని, ఎంపీ తల్లికి అందిస్తున్న చికిత్సపై వైద్యులు సమాచారం అందిస్తున్నా, అసత్యాలను ప్రచారం చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అవినాశ్ సోమవారం సీబీఐ విచారణకు హాజరు కావల్సి ఉంది. అయితే, ఆయన తల్లి తీవ్ర అనారోగ్యంతో ఈనెల 20వ తేదీ నుంచి కర్నూలులోని విశ్వభారతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆస్పత్రిలో ప్రత్యేక వైద్య బృందం ఆమెను ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తోంది. అవినాశ్ దగ్గరుండి ఆమె బాగోగులు చూసుకుంటున్నారు. తన తల్లి ఆరోగ్యం బాగోలేనందున విచారణకు హాజరు కాలేనని, ఈ నెల 27 తర్వాత హాజరవుతానని అవినాశ్ సీబీఐ అధికారులకు లేఖ పంపారు. అయినప్పటికీ, సీబీఐ అధికారులు సోమవారం ఉదయం కర్నూలు వచ్చారు. స్టేట్ గెస్ట్‌హౌస్‌లో బస చేశారు. దీనినే అవకాశంగా తీసుకున్న ఎల్లో మీడియా వెంటనే తప్పుడు కథనాలు ప్రచారం చేయడం ప్రారంభించింది. అవినాశ్‌ను అరెస్టు చేయడానికే సీబీఐ అధికారులు వచ్చారంటూ అసత్య ప్రచారం మొదలెట్టింది. వారు పోలీసు అధికారులను కలిసినట్లు, అవినాశ్‌ను ఏ క్షణంలోనైనా అరెస్టు చేస్తారంటూ స్క్రోలింగ్‌లు, చర్చలు ప్రారంభించింది. ఓ వ్యక్తి తల్లి అనారోగ్యంతో ఉంటే, అతన్ని లక్ష్యంగా చేసుకోకూడదన్న కనీస మానవతా ధర్మాన్ని కూడా విస్మరించి, తీవ్ర ఆందోళనలో అవినాశ్ పట్ల విపరీత ధోరణిని ప్రదర్శించింది. ఓ వ్యక్తికి ఉండే ప్రైవసీని కూడా హరించేలా వ్యవహరించింది. దగ్గరుండి తల్లిని రక్షించుకోవాల్సిన ఆయన ధర్మాన్ని, తల్లి పట్ల ప్రేమను పట్టించుకోకుండా సైకో మనస్తత్వాన్ని బయటపెట్టుకుంది. బాధలో ఉన్న ఆయన విచారణకు రానని కూడా చెప్పడంలేదు. ఈ నెల 27వ తేదీ వరకు గడువు



విశ్వభారతి హాస్పిటల్ వద్ద పోలీసు బందోబస్తు

కోరారు. ఆ తర్వాత విచారణకు హాజరవుతానని సీబీఐ అధికారులకు తెలిపారు. అయినా పచ్చ మీడియా క్రూరత్వాన్ని ప్రదర్శించింది. అవినాశ్‌ను అరెస్టు చేయకపోవడంతో నిరాశ చెందిన ఈ మీడియా.. కొత్త వ్యూహాన్ని రచించింది. సీబీఐ అధికారులు పోలీసు అధికారులను సంప్రదిస్తున్నారని, ఎప్పుడైనా అరెస్టు జరగవచ్చని మరో ప్రచారం మొదలెట్టింది. అదీ కాకపోవడంతో పిచ్చెక్కిపోయింది. పోలీసు అధికారులు సీబీఐకి సహకరించడంలేదని, కేంద్ర బలగాలను రప్పిస్తున్నారంటూ మరోసారి తప్పుడు వార్తలు వ్యాప్తిలోకి తెచ్చింది. మధ్యాహ్నం లోపు హైదరాబాద్ నుంచి కేంద్ర బలగాలు వస్తాయని, ఆ వెంటనే అరెస్టు అంటూ వార్తలు, చర్చలతో పచ్చ పైత్యాన్ని ప్రదర్శించింది. ముఖ్యంగా టీవీ-5, ఏబీఎన్ తప్పుడు కథనాలు, చర్చలతో హోరెత్తించాయి. వాస్తవానికి కేంద్ర బలగాలు కర్నూలుకు రాలేదు. కేవలం కర్నూలులో ఉద్రిక్త వాతావరణాన్ని సృష్టించేందుకు ఓ ప్రణాళికతో ఎల్లో మీడియాలో తప్పుడు కథనాలు ప్రసారం చేశారు.

సీబీఐని కూడా ప్రభావితం చేస్తారా?

సీబీఐ బృందం కర్నూలుకు రాగానే ఎల్లో మీడియా దుష్ప్రచారం మొదలైంది. సీబీఐ అధికారులు ఆస్పత్రికి కూడా వెళ్లలేదు. నేరుగా స్టేట్ గెస్ట్‌హౌస్‌కు వెళ్లి అక్కడే బస చేశారు. అయినా, పచ్చ మీడియా సీబీఐ వెంటనే అవినాశ్‌ను అరెస్టు చేసేస్తోందంటూ ప్రచారం మొదలెట్టింది. టీవీ చర్చల్లో తమకు అనుకూలురను కూర్చోబెట్టి, అధికారులను ప్రభావితం చేసేలా చర్చలు సాగించడాన్ని పలువురు తప్పుపడుతున్నారు. ఇది కచ్చితంగా పెడ ధోరణేనని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. చర్చల్లో వక్తలు, యాంకర్లు వ్యక్తం చేసే అభిప్రాయాలు ఇష్టానుసారం అసత్యాలతో సాగుతున్నాయని, మీడియా ట్రయల్ పేరిట వాస్తవాలను వక్రీకరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు

ఎల్లో మీడియా తప్పుడు ప్రచారాన్ని చూసి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం ఉదయం నుంచే కర్నూలుకు తరలివచ్చారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, హాఫీజ్‌ఖాన్, సుధాకర్, శ్రీదేవి, ఆర్థర్, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి ఉదయాన్నే ఆస్పత్రికి చేరుకున్నారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కడప మేయర్ సురేశ్‌బాబు కూడా ఆస్పత్రికి వచ్చారు. కర్నూలుతోపాటు పులివెందుల, కడప, వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల నుంచి కూడా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. ఒక్కసారిగా ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తరలిరావడంతో ఆస్పత్రి పరిసరాలు జనంతో కిక్కిరిశాయి. డీఎస్పీ విజయశేఖర్ ఆధ్వర్యంలో ఆస్పత్రి వద్ద ముందస్తుగా బందోబస్తు ఏర్పాటు చేశారు. సాయంత్రానికి కార్యకర్తల సంఖ్య భారీగా పెరిగింది. దీంతో ఆదోని, పత్తికొండ సబ్‌డివిజన్ నుంచి మరిన్ని బలగాలు సోమవారం రాత్రికి కర్నూలుకు చేరుకున్నాయి.

శ్రీలక్ష్మిని పరామర్శించిన వైఎస్ విజయమ్మ

వైఎస్సార్ సతీమణి వైఎస్ విజయమ్మ సోమవారం సాయంత్రం విశ్వభారతి ఆస్పత్రికి వచ్చి ఐసీయూలో చికిత్స పొందుతున్న శ్రీలక్ష్మిని పరామర్శించారు. శ్రీలక్ష్మి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అవినాశ్‌ను ఓదార్చారు. ధైర్యంగా ఉండాలని, అంతా మంచే జరుగుతుందని కాంక్షించారు.

ఆస్పత్రి ముందు కార్యకర్తల నిరసన

ఎల్లో మీడియా అబద్ధపు ప్రచారాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు భారీ సంఖ్యలో ఆస్పత్రి ముందు బైఠాయించారు. 'తండ్రిని అకారణంగా జైలుకు పంపారు. తల్లి అనారోగ్యంతో ఉంటే బాగోగులు చూసుకుంటున్న అవినాశ్‌ను వెంటాడి, వేధించడం ఏంటని' నిరసనలో పాల్గొన్న కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆందోళనకరంగానే శ్రీలక్ష్మి ఆరోగ్య పరిస్థితి

అవినాశ్ తల్లి శ్రీలక్ష్మి ఆరోగ్య పరిస్థితిపై విశ్వభారతి ఆస్పత్రి హెల్త్ బులెటిన్ రిలీజ్ చేసింది. ఆమెకు నాన్ ఎస్టీ ఎలివేషన్ మయోకార్డియల్ ఇన్ఫార్క్షన్ (గుండెపోటు) ఉందని పేర్కొంది. యాంజియోగ్రామ్ చేశామని, రెండు రక్తనాళాల్లో బ్లాక్‌లు గుర్తించామన్నారు. క్రిటికల్ కేర్ యూనిట్‌లో వైద్యుల బృందం ప్రత్యేకంగా పర్యవేక్షిస్తోందని తెలిపారు. ఆమెకు రక్తపోటు ఇప్పటికీ తక్కువగా ఉండటంతో అయానోట్రోపిక్ సపోర్ట్‌తో ఉన్నారని తెలిపారు. ఆది, సోమవారాల్లో ఆమె వాంతులు చేసుకున్నారని, అల్ట్రాసౌండ్ చేయాల్సి ఉందని తెలిపారు. మరికొద్దిరోజులు వైద్యుల పర్యవేక్షణలో ఉండాలని వెల్లడించారు.

అర్ధరాత్రి వేళ ఆస్పత్రిలోకి చొరబాటు

వందలాది రోగులు, వారి సహాయకులు ఉండే ఆస్పత్రిలోకి మీడియా పదే పదే జొరబడటంపై సీనియర్ విలేకరులే మండిపడుతున్నారు. కేవలం చంద్రబాబుకు ఏదో మేలు చేయాలన్న తపనతోనే ఎల్లో మీడియా పత్రికా స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తోందని విమర్శిస్తున్నారు. ఇదే ఉద్దేశంతో విశ్వభారతి ఆస్పత్రి పరిసరాల్లో ఆదివారం అర్ధరాత్రి, ఎల్లో మీడియా హంగామా చేసింది. రాత్రి 11గంటల తర్వాత ఎల్లో మీడియా ప్రతినిధి ఒకరు తాను పనిచేస్తున్న సంస్థ పేరు కాకుండా మరో పేరు చెప్పి ఆస్పత్రిలోకి వెళ్లారు. శ్రీలక్ష్మి ఉన్న ఐసీయూ సమీపంలో ఓ కానిస్టేబుల్ అతన్ని నిలువరించారు. తప్పుడు పేరు చెప్పి రావాల్సిన అవసరం ఏముందని అక్కడున్న వారు కూడా గట్టిగా నిలదీశారు. దీంతో మీడియా ప్రతినిధి ఆస్పత్రి గేటు వద్దకు వచ్చి అవినాశ్ అనుచరులపై దుందుడుకుగా వ్యవహరించారు. ఇదంతా మిగతా ఎల్లో మీడియా ప్రతినిధులు వీడియో తీయబోయారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. ఇలా ఎల్లో మీడియా అతిగా ప్రవర్తించడాన్ని పలువురు తప్పుపడుతున్నారు.

కాళేశ్వరంతో ఒక నదినే ఎత్తిపోశారు

అమెరికన్ సొసైటీ ఆఫ్ సివిల్ ఇంజనీర్స్ సమావేశంలో కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: ఒక నాయకుడి అచంచలమైన నిబద్ధతకు కాళేశ్వరం ప్రాజెక్టు నిదర్శనమని, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ చెప్పారు. ఒక నదిని ఎత్తిపోయడం ద్వారా లక్షలాదిమంది జీవితాల్లో వెలుగును నింపి జీవనోపాధి కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. తెలంగాణ సాగునీటి ప్రగతి ప్రస్థానం, ఇంజనీరింగ్ నైపుణ్యం, దాని ద్వారా కలిగిన మార్పులు ఈరోజు ప్రపంచానికి, సివిల్ ఇంజనీరింగ్ రంగంలో ఆదర్శంగా నిలుస్తాయని తెలిపారు. అమెరికాలోని నెవడా రాష్ట్రం హెండర్సన్‌లో సోమవారం జరిగిన అమెరికన్ సొసైటీ ఆఫ్ సివిల్ ఇంజనీర్స్ నిర్వహించిన 'వరల్డ్ ఎన్విరాన్‌మెంటల్ అండ్ వాటర్ రిసోర్స్ కాంగ్రెస్' సమావేశంలో మంత్రి కేటీఆర్ ప్రారంభోపన్యాసం చేశారు.

618 మీటర్ల ఎత్తుకు తీసుకెళ్లి...: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడక ముందు కరువుకు నిలయంగా మారడంతోపాటు వ్యవసాయ రంగం సంక్షోభంలో నిలిచిందని కేటీఆర్ చెప్పారు. 55 శాతం జనాభా వ్యవసాయ రంగం మీద ఆధారపడి ఉన్న తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం అత్యవసరం అనే విషయాన్ని గుర్తించి కాళేశ్వరం ప్రాజెక్టును రికార్డు సమయంలో సీఎం కేసీఆర్ పూర్తి చేశారన్నారు. సముద్ర మట్టానికి 90 మీటర్ల ఎత్తున ఉన్న నీటిని 618 మీటర్ల స్థాయికి ఎత్తిపోతల ద్వారా తీసుకుపోయి వివిధ ప్రాజెక్టులు నింపడం ప్రపంచ సాగునీటి చరిత్రలోనే ఒక అద్భుతంగా నిలిచిపోతుందన్నారు. ఈ ప్రాజెక్టు కోసం తరలించిన మట్టి ద్వారా 101 గిజా పిరమిడ్లను నిర్మించవచ్చని, ఈ ప్రాజెక్టులో ఉపయోగించిన స్టీల్ ద్వారా 66 ఈఫిల్ టవర్ల నిర్మాణం చేయొచ్చన్నారు. ఈ ప్రాజెక్టులో ఉపయోగించిన కాంక్రీట్ ద్వారా 53 బుర్జ్ ఖలీఫాలు కట్టవచ్చన్నారు.

ఇంజనీరింగ్ అద్భుతం: కాళేశ్వరం సాగునీటి ప్రాజెక్టు మాత్రమే కాదని ఒక ఇంజనీరింగ్ అద్భుతం అని కేటీఆర్ పేర్కొన్నారు. 13 జిల్లాల్లో సుమారు 500 కి.మీ మేర ఈ ప్రాజెక్టు విస్తరించిందని, 1,800 కి.మీ కాల్వల నిర్మాణం జరిగిందని, ఏడు మెగా లింకులను 28 ప్యాకేజీలుగా 22 పంపుహౌస్‌ల నిర్మాణం చేశారన్నారు. ఈ ప్రాజెక్టులో నీటి నిల్వ కోసం 20 రిజర్వాయర్లు నిర్మించారని, 50 టీఎంసీలతో మల్లన్న సాగర్ లాంటి అతి పెద్ద రిజర్వాయర్‌ను నిర్మించినట్లు తెలిపారు. 240 టీఎంసీల నీటిని సాగు, తాగు నీటి అవసరాలతో పాటు పారిశ్రామిక అవసరాల కోసం వాడుకునే అవకాశం ఉందన్నారు. కాళేశ్వరంతో 90 లక్షల ఎకరాల్లో రెండు పంటలుగా సాగవుతున్నాయని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టును ప్రతిష్టాత్మకమైన 'ఎండ్యూరింగ్ సింబల్ ఆఫ్ ఇంజనీరింగ్ ప్రోగ్రెస్'గా గుర్తిస్తూ అమెరికన్ సొసైటీ ఆఫ్ సివిల్ ఇంజనీర్స్ ఇచ్చిన అవార్డును కేటీఆర్ స్వీకరించారు.

ఫిర్యాదుదారులను తిప్పకోవద్దు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): వివిధ రకాల సమస్యలపై కార్యాలయాలకు వచ్చే వారిని తిప్పుకోకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ రవినాయక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో ప్రజల నుంచి ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల స్థాయిలో సమస్యలను అక్కడే పరిష్కరించాలని వారు జిల్లాకేంద్రానికి వచ్చే పరిస్థితి తేవొద్దన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సీతారామారావు, జెడ్పీ సీఈఓ జ్యోతి, డీఆర్‌డీఓ యాదయ్య పాల్గొన్నారు.

'దివ్యాంగుల బంధు' అమలుచేయాలి



దళితబంధు మాదిరిగానే 'దివ్యాంగుల బంధు' అమలు చేయాలి. శారీరక దివ్యాంగులకు రోస్టర్ పాయింట్ 10లోపు మార్చడం, జిల్లాలోని ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. ప్రతి కుటుంబానికి 35 కిలోల బియ్యం అంత్యోదయ కార్డు మంజూరు చేయాలి. అర్హులైన వారికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఒక కుటుంబానికి ఏడాదికి 5 గ్యాస్ సిలిండర్లను, పిల్లలకు ఉచిత విద్య అందించాలి. ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేయాలి. ప్రత్యేక ప్రజావాణి ఏర్పాటు చేయాలి. రిజర్వేషన్ 4 నుంచి 10 శాతానికి పెంచాలి. రూ.5 లక్షలలోపు బ్యాంకు రుణాలు ఇవ్వాలి.

– లలిత, తెలంగాణ దివ్యాంగుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

రైస్‌మిల్లును సీజ్ చేయండి

తరుగు పేరుతో రైతులను మోసం చేస్తున్న లక్ష్మీబాలాజీ రైస్‌మిల్లును సీజ్ చేయాలి. హన్వాడ, కోయిల్‌కొండ, మహమ్మదాబాద్, గండీడ్ మండలాల రైతులను సదరు రైస్‌మిల్లు నిండా ముంచేసింది. తాలు, ఇసుక పేరుతో కిలోల కొద్ది తరుగు తీస్తున్నారు. ఇప్పటి దాకా అక్రమంగా కట్ చేసిన వేలాది బస్తాల వడ్లను రికవరీ చేసి రైతులకు న్యాయం చేయాలి.

– తెలంగాణ రైతు సంఘం నాయకులు

ఇష్టారాజ్యం



సుంకరి చెరువులో తవ్విన కాల్వ

సుంకరి చెరువులో నిబంధనలకు విరుద్ధంగా పనులు

- అధికారుల ఆదేశాలు బేఖాతరు
- చుక్కనీరు నిల్వని వైనం
- అయోమయంలో ఆయకట్టు రైతులు, మత్స్యకారులు

చిన్నచింతకుంట: ప్రభుత్వం ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో రూ.కోట్లు వెచ్చించి చెరువులు, కుంటల మరమ్మలు చేపడుతూ ఏటా నీటితో నింపుతుంది. అంతేగాక చెరువుల్లో చేప పిల్లలను వదిలి మత్స్యకారులకు జీవనోపాధి కల్పిస్తుంది. కాని కొందరు అక్రమార్కులు నిబంధనలకు విరుద్ధంగా చెరువుల్లో పనులు చేపడుతూ నీరు నిల్వకుండా చేస్తున్నారు.

● మండలంలోని మద్దూర్ సుంకరి చెరువులోని 74 ఎకరాల ఏక్ ఫసల్ భూములను గతేడాది ఆంధ్రా, హైదరాబాద్‌కు చెందిన వ్యక్తులు కొనుగోలు



చెరువులోకి నీరు రాకుండా చుట్టూ కట్ట నిర్మాణం

చేశారు. ఆ భూమిని సాగు చేసేందుకు చెరువులో నీరు నిల్వకుండా నిబంధనలకు విరుద్ధంగా పనులు చేపట్టారు. చెరువును నింపే వరద కాల్వను నేరుగా అలుగు వరకు తీసి కిందకి వృథాగా పారేలా 20 ఫీట్ల లోతు తవ్వారు. అంతేగాక చెరువులో అక్కడక్కడ బోర్లు వేయించి చుట్టూ కంచె ఏర్పాటు చేశారు. దీంతో చెరువులో చుక్క నీరు నిల్వక ఆయకట్టు రైతులు, మత్సకారులు ఆందోళన చెందుతున్నారు. గత నెల 24న ఆయకట్టు రైతులు, మత్స్యకారులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో 25న తహసీల్దార్ సువర్ణరాజు, ఇరిగేషన్ డిప్యూటీ డీఈ గోపాలాచారి చెరువును పరిశీలించి నిబంధనలకు విరుద్ధంగా పనులు చేపట్టారని.. వెంటనే పనులు నిలిపివేసి కాల్వలు పూడ్చాలని ఆదేశించారు. కాని నేటికీ ఆ కాల్వలను పూడ్చకపోవడంతో రైతులు మండిపడుతున్నారు. వెంటనే చెరువులోని కాల్వలను పూడ్పించాలని కోరుతున్నారు.

నిబంధనలు పట్టించుకోవడం లేదు..



సుంకరి చెరువులో భూములు కొన్న రైతులు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కాల్వలు, కందకాలు తవ్వి నీరు నిల్వకుండా చేస్తున్నారు. దీంతో ఆయకట్టు రైతులు, మత్స్యకారులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. అధికారులు స్పందించి పనులు నిలిపివేసి చెరువులో నీరు చేరేలా చూడాలి.

– చెన్నారాయుడు, మత్స్యకారుడు, మద్దూరు

సాగునీరు అందని పరిస్థితి..



చెరువు సమీపంలో 10 ఎకరాల భూమి ఉంది. చెరువు నీటితోనే వరి పంట సాగుచేస్తాం. నీరు నిల్వకుండా చేస్తే మా పరిస్థితి ఏమిటి? పంటలు ఎలా సాగు చేసుకోవాలి. అధికారులు స్పందించి పనులు నిలిపివేయాలి.

– రాఘవేందర్‌గౌడ్, రైతు, మద్దూర్

చర్యలు చేపడతాం..



చెరువులో ఏక్ ఫసల్ భూమి కొన్న పట్టాదారులు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పనులు చేపడుతున్నారు. ఇది వరకే కాల్వలను పూడ్చాలని ఆదేశించాం. కాల్వలు, కందకాలను త్వరలోనే పూడ్చేయిస్తాం.

– సువర్ణరాజు, తహసీల్దార్, చిన్నచింతకుంట

150 ఏళ్ల క్రితం గ్రామ రైతుల సాగునీటి కోసం పెద్దలు సుంకరి చెరువును తవ్వించారు. ఈ చెరువు కింద 250 ఎకరాల ఆయకట్టు ఉంది. చెరువులో 9.24 ఎకరాల శిఖం భూమి.. 74 ఎకరాల ఏక్ ఫసల్ భూమి 12 మంది రైతుల పేర్ల మీద ఉంది. ఇంతకాలం ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతులు చెరువులో నీరు లేనప్పుడు మాత్రమే పంటలు

సాగునీటి కోసమే..

సాగు చేసుకునేవారు. గతేడాది భూములను ఇతర ప్రాంతాల వారికి విక్రయించడంతో చెరువు స్వరూపాన్ని మార్చేశారని రైతులు చెబుతున్నారు. చెరువును నమ్ముకొని జీవిస్తున్న ఆయకట్టు రైతులతో పాటు మత్స్యకారుల కుటుంబాలు సుమారు 90 రోడ్డున పడే అవకాశం ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేగాక వర్షాకాలంలో వరద కాల్వ, ఎర్ర కాల్వలకు నీరు ప్రవాహం పెరిగి తూముతో పాటు చెరువుకట్ట తెగే ప్రమాదం ఉందని రైతులు భయాందోళనకు గురవుతున్నారు. అమరచింత-చిన్నచింతకుంటకు రాకపోకలు నిలిచిపోయే అవకాశం ఉందని చెబుతున్నారు.

గురుకులాల నిధులపై బహిరంగ చర్చకు సిద్ధం

ఎర్రవల్లి చౌరస్తా: రాష్ట్ర బడ్జెట్‌లో గురుకులాలకు కేటాయించిన నిధులపై బహిరంగ చర్చకు తాను సిద్ధమని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సీఎం కేసీఆర్‌కు సవాల్ విసిరారు. బీఎస్పీ ఆధ్వర్యంలో చేపట్టిన బహుజన రాజ్యాధికార పాదయాత్ర సోమవారం జోగుళాంబ గద్వాల ఇటిక్యాల మండలంలోని తిమ్మాపురం, కొండపేట, యాక్తాపురం గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల సమస్యలను గాలికి వదిలేసిందన్నారు. సచివాలయాన్ని రూ.1,400 కోట్లతో ఆగమేఘాల మీద నిర్మించుకున్న సీఎంకు గురుకులాల సొంత భవనాలకు నిధులు కేటాయించేందుకు చేతులు రావడం లేదని విమర్శించారు. ఎన్నో ఏళ్లుగా వందలాది గురుకులాలు ప్రైవేట్, అద్దె భవనాల్లో నడుస్తున్నా సోయి లేదన్నారు. 2018లో రూ.1,250 కోట్లతో గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని టెండర్లు ఖరారు చేస్తే కాసులకు కక్కుర్తిపడి తన వాళ్లకు టెండర్ రాలేదనే అక్కసుతో బలవంతంగా రద్దు చేయించారని ఆరోపించారు. ప్రైవేట్,



మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

అద్దె భవనాల్లో కోడిపిల్లల్లా బిక్కుబిక్కుమంటూ బతుకుతున్న బహుజన బిడ్డల గోడు నియంత పాలకులకు పట్టడం లేదా అని ప్రశ్నించారు. బీఎస్పీ అధికారంలోకి వచ్చిన వెంటనే విద్య ఉద్యోగాలకు పెద్దపీట వేస్తుందన్నారు. అన్ని హంగులతో ప్రతి మండలంలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో పాఠశాలలు నిర్మిస్తామని ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో డబ్బుకు ఆశపడి ఆధిపత్య పార్టీలకు ఓటు వేస్తే మళ్లీ బహుజనుల బతుకులు బానిసత్వంలో మగ్గుతాయని హెచ్చరించారు.

తెలంగాణ వైతాళికుడు భాగ్యరెడ్డివర్మ

పీయూ వీసీ ప్రొ.లక్ష్మీకాంత్‌రాథోడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: తెలంగాణ వైతాళికుడు భాగ్యరెడ్డివర్మ అని పీయూ వైస్ చాన్స్‌లర్ ప్రొ.లక్ష్మీకాంత్ రాథోడ్ పేర్కొన్నారు. సోమవారం పాలమూరు యూనివర్సిటీలో భాగ్యరెడ్డివర్మ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ నిమ్నవర్గాల అభ్యున్నతికి పాటుపడిన దార్శనికుడని కొనియాడారు. హిందూ మత సంస్కరణ కోసం భాగ్యరెడ్డివర్మ చేసిన కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో పీయూ రిజిస్ట్రార్ ప్రొ.కె.గిరిజా మంగతాయారు, వీసీ ఓఎస్‌డీ డా.డి.మధుసూదన్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ కె.ప్రవీణ, అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ డా.ఎం.నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.



పీయూలో భాగ్యరెడ్డివర్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ తదితరులు

భాగ్యరెడ్డివర్మ ఆశయాలను కొనసాగించాలి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): భాగ్యరెడ్డివర్మ ఆశయాలను కొనసాగించాలని కలెక్టర్ రవినాయక్ అన్నారు. భాగ్యరెడ్డివర్మ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సీతారామారావు, జెడ్పీసీఈఓ జ్యోతి, డీఆర్‌డీఓ యాదయ్య, జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి మధుసూదన్‌గౌడ్, సాంఘిక సంక్షేమ శాఖ ఇన్‌చార్జ్ డీడీ పాండు, డీపీఆర్‌ఓ వెంకటేశ్వర్లు, హౌజింగ్ ఈఈ భాస్కర్, కలెక్టరేట్ ఏఓ శంకర్ పాల్గొన్నారు.

మతం ముసుగులో విద్వేషం

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): మతం ముసుగులో ప్రజల మధ్య విద్వేషాలు చిమ్ముతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాల్‌నర్సింహ అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దక్షిణ భారతదేశంలో బీజేపీ ప్రభుత్వం కుట్రపూరిత మత రాజకీయాల పాచికలు పారవని.. కర్ణాటక ప్రజలు మతచిచ్చుకు బీటలు వేశారన్నారు. బీజేపీ ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన వెంటనే సగటు మనిషి పెరిగే అధిక ధరలతో జీవించలేని దుస్థితి నెలకొందన్నారు. మోదీ దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు ఒక్క రూపాయి తగ్గించకుండా కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పి దేశ సంపదను ధారాదత్తం చేస్తున్నారన్నారు. ప్రజా సమస్యలపై దృష్టి పెట్టకుండా ఎంతసేపు రాజకీయాలపైనే దృష్టి పెడుతున్నారని విమర్శించారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బాల్‌కిషన్, పరమేష్, కార్యవర్గ సభ్యులు సురేష్, గోవర్ధన్, అల్వాల్‌రెడ్డి, చాంద్‌పాషా, శంకర్‌నాయక్, రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాల్‌నర్సింహ

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమిస్తాం

కందనూలు: కేజీబీవీ యూఆర్ఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగులకు బేసిక్ పే మంజూరు చేసి రెగ్యులరైజ్ చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె.జంగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిచో ఆందోళన ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. బాలికా విద్యను ప్రోత్సహించడానికి ఏర్పాటు చేసిన కేజీబీవీలలో పేద పిల్లల కోసం ఏర్పాటు చేసిన యూఆర్ఎస్‌లలో కాంట్రాక్టు పద్ధతిన అతి తక్కువ వేతనాలతో విధులు నిర్వహిస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట జిల్లా అధ్యక్షుడు ఆర్ కృష్ణ అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో పాల్గొన్నారు. కేజీబీవీలలో స్పెషల్ ఆఫీసర్ నుంచి వర్కర్ వరకూ అందరూ మహిళా ఉద్యోగులే కష్టపడి పనిచేసి, అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నారని, అయినా ప్రభుత్వం నుంచి సరైన గుర్తింపు లేక పనికి తగిన వేతనం ఇవ్వక శ్రమదోపిడీ చేస్తున్నారని అన్నారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ ధర్నా చేపట్టామని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు ఎం.రమాదేవి, జిల్లా పూర్వ అధ్యక్షుడు పి.వహీద్ ఖాన్, జిల్లా కోశాధికారి జె.బాల్ రాజు జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ ఎస్.నెహ్రూ ప్రసాద్, జిల్లా కార్యదర్శులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కందికొండ గీత మరియు అధిక సంఖ్యలో కేజీబీవీ, యూఆర్ఎస్ ఉపాధ్యాయ ఉద్యోగులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కె.జంగయ్య